క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణ లక్ష్మి చెక్కులను రైతువేదికలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజొద్దీన్, డెప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్,సిరివంచకోట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ధర్మపురి సొసైటీ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులు మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు,పీఏసీఎస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పెగడపల్లిలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

పెగడపల్లి: ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలవ్యాప్తిని నియంత్రించాలని వైద్యాధికారి నరేశ్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారి నరేశ్, సూపర్‌వైజర్ జయశీల, నర్సింగ్ ఆఫీసర్లు శ్రీలత, రవికిరణ్, సిబ్బంది కల్పన, భాస్కర్, శ్రీకాంత్‌రెడ్డి, రమణ, హెచ్‌వి ద్వారకా పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


సర్వే పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వినోద్

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను నియోజకవర్గ ప్రత్యేకాధికారి వినోద్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై మండలాధికారులు ఇంటింటా తిరిగి విచారణ చేపడుతున్నారు. నిరుపేదలకు, అసలే ఇల్లు లేక గుడిసెల్లో, అద్దె ఇంట్లో ఉన్నవారిని అర్హులుగా గుర్తించాలన్నారు. అర్హులకే ఇళ్లు దక్కేలా అధికారులు పకడ్బందీగా విచారణ చేయాలని సూచించారు. పైరవీలకు ఆస్కారం ఉండవద్దన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, కార్యదర్శి ఎండీ గఫూర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆస్తుల సంరక్షణ కోసమే వక్ఫ్ సవరణ బిల్లు

మల్యాల: ఆస్తుల సంరక్షణ కోసమే వక్ఫ్ సవరణ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం,కన్వీనర్ బింగి వేణు ఆధ్వర్యంలో శుక్రవారం మల్యాలలో వక్ఫ్ సవరణ బిల్లుపై అవగాహన కల్పించారు. దాతలు ఇచ్చిన భూములు దుర్వినియోగం కాకుండా చూడడమే లక్ష్యమని, వక్ఫ్ బిల్లుపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంగని రవి, పొన్నం సాయికుమార్; బొబ్బిలి వెంకటస్వామి, నులుగొండ సురేశ్, కెల్లేటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రజోత్సవ సభకు భారీగా తరలిరావాలి

సారంగాపూర్: ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి జన సమీకరణపై పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. మండలం నుంచి 1000 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నేరెళ్ల సుమన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై సర్వే

- ఇందిరమ్మ కమిటీల జాబితాపై అధికారుల విచారణ
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు
- పరిశీలన తర్వాత తుది జాబితా


భూషణరావుపేటలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

కథలాపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా వివరాలతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ విషయాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందిరమ్మ కమిటీ తయారు చేసిన ఇళ్ల జాబితాలో పేరున్న ప్రతీ ఇంటికి అధికారులు వెళ్లాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రత్యేకంగా తయారుచేసిన ప్రొఫార్మాలో వివరాలతో తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు

ఇందిరమ్మ ఇళ్లను ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. దరఖాస్తుల ఆధారంగా ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయించాలో సంబంధిత ఎమ్మెల్యేలు తుది నిర్ణయం తీసుకునే వీలుంది.

జిల్లా పరిధిలో జగిత్యాల, కోరుట్ల ధర్మపురి నియోజకవర్గాలు పూర్తిగా వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో కొన్ని మండలాలు మాత్రమే ఉన్నాయి. ఇలా జిల్లాకు సుమారు 13 వేల నుంచి 14 వేల వరకు ఇళ్లు మంజూరు కానున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ప్రత్యేకంగా సమావేశమై ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తయారు చేసి ఎంపీడీవోలకు అందించారు. ఈ జాబితా ఆధారంగా మండలాల్లో ఎంపీడీవో, ఎంపీవో, ఏఈలు, కార్యదర్శులు బృందాలు ఏర్పడి క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. ఒకొక్క అధికార బృందానికి సుమారు 200 మంది దరఖాస్తుదారులను సర్వే చేయనున్నారు.

అర్హుల ఎంపికకు ఆరా తీస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలతో గ్రామాలకు వెళ్లిన అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి సమీపంలో ఉంటున్నవారిని సైతం వివరాలు అడుగుతున్నారు. ప్రస్తుతం నివాసముంటున్న వారి ఇంటి పైకప్పు ఉలా ఉంది, గోడలు ఏ విధంగా ఉన్నాయి, బీపీఎల్ కుటుంబానికి చెందినవారేనా అని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఈ విచారణను వారం రోజుల్లో పూర్తి చేసి వచ్చే నెల 2న గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ప్రదర్శిస్తారు. తదుపరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల పేర్లతో ప్రొసీడింగ్‌లు జారీ చేస్తారని అధికారులకు ఉత్తర్వులు అందాయి. కాగా ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి విడతలో ప్రాధాన్యత నివ్వాలని ఆయా గ్రామ, పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇళ్లు లేని వారికి ప్రాధాన్యం ఇవ్వాలి



పార్టీలకతీతంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. ఆర్థికంగా ఉన్నవారికి, పైరవీలు చేయించుకుంటే ఇళ్లు మంజూరు చేయవద్దు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఈ ప్రభుత్వం చేస్తే ఏమి లాభం. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

– యాగండ్ల రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

నెలాఖరు వరకు విచారణ పూర్తి



ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాల ఆధారంగా మండలాధికారుల బృందం గ్రామాల్లో విచారణ చేపడుతున్నాయి. జాబితాలో పేర్లున్న ప్రతీ ఇంటికి వెళ్లి వాస్తవ వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. నెలాఖరులోగా పూర్తి చేసి తుది జాబితాను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం.

– శంకర్, ఎంపీడీవో, కథలాపూర్


కథలాపూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థల పాలవుతున్నారు. మరుగుదొడ్ల గదులు అపరిశుభ్రంగా ఉండటంతో వినియోగించుకోలేకపోతున్నామని ప్రయాణికులు పేర్కొన్నారు. మధ్యాహ్న వేళ బస్టాండ్‌లోకి నేరుగా సూర్య కిరణాలు పడి ఎండ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. చెట్ల నీడలో నిరీక్షించాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: మనోహర్
ఆర్టీసీ డీఎం, కోరుట్ల, సెల్ నంబర్: 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఉగ్ర దాడిపై ముస్లింల నిరసన


ధర్మపురిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


మెట్‌పల్లిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

మెట్‌పల్లి: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడాన్ని ఖండిస్తూ పట్టణంలోని మదీనా మసీదు వద్ద శుక్రవారం ముస్లిలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఫ్తీ అబుబాకర్, ఖాజా అజీమ్, రైసుద్దీన్, సమీర్, సిరాజ్, సలీం, హనీఫ్ తదితరులున్నారు.

మేడిపల్లి: జమ్ము కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేసి కాల్చి చంపినందుకు నిరసనగా మేడిపల్లి ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు. కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ సభ్యులు అనుసరాలి, అన్సర్, ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: జమ్మూకాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో ముస్లింలు గాంధీ విగ్రహం నుండి నంది కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

అమరులకు నివాళి


రాయికల్‌లో ముస్లింల శాంతియుత ర్యాలీ

రాయికల్: పహల్గమ్ ఘటనకు నిరసనగా పట్టణంలోని సెంట్రల్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మైనార్టీలు శాంతియుత ర్యాలీ నిర్వహించి అమరులకు నివాళి అర్పించారు. కిష్టంపేటలో యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: పహల్గాంలో మృతి చెందినవారికి శుక్రవారం మండలకేంద్రంలో ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. భూషణరావుపేటలో చిన్నారులు శుక్రవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డీ రఫీ, చాంద్, మోయిన్, పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం నాయకులు,గ్రామస్తులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

మల్లాపూర్: ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన యాత్రికులకు శుక్రవారం రాత్రి మల్లాపూర్ మండలంలోని సంగెం-శ్రీరాంపూర్ గ్రామంలో నాయకులు, యువకులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో ఘన నివాళి అర్పించారు.


కథలాపూర్‌లో మృతులకు నివాళి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


నిర్వాహకులకు సూచనలిస్తున్న రఘువరన్

వెల్గటూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. శుక్రవారం వెల్గటూర్ ఎండపల్లి మండలాల లోని పైడిపెల్లి, రాంనూర్, గుల్లకోట, రాజారాంపల్లిలోని ఐకేపీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని ఆదేశించారు. కార్యక్రమంలో వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్, ఎండపల్లి నాయబ్ తహసీల్దార్ అనిల్, ఏపీఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దుంపేటలో బడిబాట

కథలాపూర్: మండలంలోని దుంపేటలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్య, వసతులను తల్లిదండ్రులకు వివరించారు. ర్యక్రమంలో హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు రాజ్‌కిరణ్, చంద్రమౌళి, జయశ్రీ, ప్రేమలత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ప్రజాప్రతినిధులకు, వివిధ పార్టీల నాయకులకు, మండల, గ్రామస్థాయి అధికారులు, రైతులకు శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పొన్నాల గార్డెన్స్‌లో జరిగే అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ హాజరవుతారని పేర్కొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి


నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన

జగిత్యాలక్రైం: పోక్సో చట్టం పట్ల విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని సీసీఎస్ ఎస్సై రవీందర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల నర్సింగ్ కళాశాలలో సీసీఎస్, ఎహెచ్‌టీయూ, భరోసా సెంటర్ల ఆధ్వర్యంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను వేధించినా, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినా పోక్సో చట్టం ద్వారా కఠిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. విద్యార్థినులు సోషల్ మీడియా పట్ల, సెల్‌ఫోన్ వాడకం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పిల్లల కదలికలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భరోసా నిర్వాహకులు సుజాత, ప్రతిభ, సునీత, లక్ష్మీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో, జైపాల్‌రెడ్డి

జగిత్యాల: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రతీ ఒక్కరు ప్రభుత్వ నియమనిబంధనలు పాటించాలని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. శుక్రవారం మాతాశిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డితో కలిసి ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు నిబంధనలు అతిక్రమించకుండా ప్రజలకు వైద్యం అందించాలన్నారు. ప్రతినెల ఫారం ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన తర్వాత ఒక కాపీ 5వ తేదీలోపు సబ్మిట్ చేయాలన్నారు. స్కానింగ్ చేసే చోట పేషెంట్స్‌కు కన్పించేలా లింగ నిర్ధారణ నేరమని ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కట్కం భూమేశ్వర్, తరాల భూమేశ్వర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చదువు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థి స్వర్గం అనిల్ రూ. 30 వేల విలువ చేసే ప్యూరీఫైడ్ వాటర్ మిషన్ పాఠశాలకు అందజేశారు. 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

రాయికల్: మండలంలోన మైతాపూర్ గిరి గుట్ట దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అర్చకులు కాసునూరి జగదీశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంగమల్లయ్య, కోశాధికారి రాజు, కార్యదర్శి అమర్ పాల్గొన్నారు.

ధన్వంతరి ఆలయంలో కుంకుమ పూజలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని శ్రీధన్వంతరి దేవాలయంలో శుక్రవారం మాతలు కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. లలితసహస్రనామాల స్తోత్ర పారాయణం నిర్వహించారు.పూజల అనంతరం లక్కీడీప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

రాయికల్: పట్టణంలోని 853/బీ సర్వేనంబరులో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న బేస్‌మెంట్‌ను తొలగించినట్లు కమిషనర్ మనోహర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. బల్దియాలో ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించి నిర్మాణాలు చేపట్టాలని, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు లేకుండా తొలగిస్తామని హెచ్చరించారు.

విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనశుద్ధిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రైకోడెర్మ విరిడి శిలింధ్రపు ఎరువు తయారీ గురించి వివరించారు. ట్రైకోడెర్మ విరిడి శిలింధ్రంను కలిపి విత్తనశుద్ధి చేయాలన్నారు. పసుపు, కూరగాయలు, మిరప విత్తనాలను శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో యోగితా, ఏఈవో సుష్మా, రైతులు తిరుపతి, సంజీవ్, గంగారావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠాపన

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం శ్రీ సరస్వతి విద్యా మందిర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ తొగిటి జగదీశ్వర్,ప్రిన్సిపాల్ దాసరి పరందం, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ రవీందర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో కొత్త విద్యుత్ వైర్ల ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ. 9 లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బసవేశ్వర జయంతి ఉత్సవ కమిటీ

జగిత్యాల: మహాత్మ బసవేశ్వర జయంతిని ఈనెల 30న అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం 22 మందితో ఒక ఉత్సవ కమిటీ నియమించింది. ఉత్సవ కమిటీలో జగిత్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది గుంటి జగదీశ్వర్ నియమితులయ్యారు. నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఈత చెట్లు దగ్ధం

మెట్‌పల్లిరూరల్: జిల్లా సరిహద్దు శివారులోని మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలో ఈత చెట్లు దగ్ధమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన బండలింగాపూర్ గౌడ కులస్తులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. 500కు పైగా ఈత చెట్లు దగ్ధమైనట్లు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మల్లాపూర్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద పాత బస్టాండ్ సమీపంలో పెరుమాండ్ల రాజేందర్ తన తండ్రి నారాయణ జాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని దుంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఉడుగుల లక్ష్మణ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మల్యాల రమేశ్, అంబటి పురుషోత్తం, జెల్ల వేణు, ఎం.డీ రఫీ, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వావిలాల ఉమాదేవి జ్ఞాపకార్థంగా స్థానిక బస్టాండ్‌లో కుటుంబ సభ్యులు వావిలాల ప్రకాశ్, భూసాగర్, జగదీష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

స్వచ్ఛందంగా బంద్ పాటించండి

మల్లాపూర్: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా శనివారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బంద్ పాటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని వర్తక, వాణిజ్య, విద్యాలయాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్లు, చిరువ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్, మొరపు జలపతి తదితరులు పాల్గొన్నారు.